

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం ఇస్తున్న విజయరావు, మడజాజన్

వీఆర్‌వోల డిమాండ్లు పరిష్కరించాలి

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌వోల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వీఆర్‌వోల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.విజయరావు వినతిపత్రం మంగళవారం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని, కాలానుగుణంగా ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. వీఆర్‌వోలకు వేతన, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఆర్‌వోల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 1న హైదరాబాద్‌లో వీఆర్‌వోల మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీ.హెచ్.మడజాజన్, మనోహర్, శ్రీరాములు, కె.రాజు, వెంకటేష్, కృష్ణంరాజు, విజయకుమార్, పాకరాజు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు



తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పుర వద్ద యుద్ధప్రాతిపదికన తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి పూర్తి చేసినట్లు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి మంగళవారం తెలిపారు. బర్కత్‌పుర చౌరస్తా వద్ద వరద నీటి కాలువ నిర్మాణం వల్ల తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో ప్రజల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్‌లను ఈ ప్రాంతానికి పిలిపించి పనులు చేపట్టి పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, కృష్ణకుమార్, క్షీరసాగర్, బల్వీర్, భీమ్‌రాజ్, ఎల్.సత్యనారాయణ, సూరి, కృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు

మాలల సింహగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నల్లకుంట, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన కోసం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య, కో-ఆర్డినేటర్ డి.నర్సయ్య, హైదరాబాద్; రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఇన్‌చార్జి రాజువస్సాద్, తెలంగాణ మాల సంఘం నేత జంగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఏఎన్ఎం లక్ష్మీబాయి, విశాల్

ముషీరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్‌కు చెందిన పేద కుటుంబాలకు బైబిల్‌హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం లక్ష్మీబాయి, స్థానికుడు విశాల్ మూడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. భోలక్‌పూర్‌లోని వారి ఇంటికి వెళ్లి బియ్యం, మంచినూనె, కందిపప్పు, బిస్కెట్ల తదితర సరుకులను అందజేశారు.

అభయహస్తం పథకానికి నిధులు కేటాయించాలి

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అభయహస్తం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ అభయహస్తం అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది పూర్తయిన ఒక్కపైసా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి 33,124 కోట్లు కేటాయించినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు సరస్వతి, నగర అధ్యక్షురాలు రాణి, నాయకులు ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో మార్పులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బద్రినాథ్

చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, న్యాయ శాస్త్రంలో జరిగిన మార్పులను గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే న్యాయ వృత్తిలో రాణించవచ్చని డాక్టర్ వీఆర్.బద్రినాథ్ నం దుల పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను అన్ని కోణాలలో పెంపొందించుకోవాలన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.అపర్ణ, వాసవి విద్యా సంస్థల కోశాధికారి వి.ఎం.పార్థసారధి, పి.అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల ఆన్‌లైన్ మ్యాగజైన్ ఆవిష్కరించగా లా ఎక్స్‌పొసిషన్ - లెక్స్ లూమినస్ విద్యార్థులు నిర్వహించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

వర్గీకరణ వ్యతిరేకులకు రాజ్యాంగం పేరు ఎత్తే అర్హత లేదు

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ వ్యతిరేక శక్తులకు రాజ్యాంగం పేరు ఎత్తే అర్హత లేదని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాలలు మద్దతు పలికి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని సూచించారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు పోరాటం చేస్తుంటే మాలలు అడ్డుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్యామ్‌రావు, కె.వెంకట్, చందు, నాగరాజు, సురేష్, జీవన్, కార్తీక్, మణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వృద్ధులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ

స్వామి వివేకానంద యువసేన అధ్యక్షుడు దేవరుప్పల శ్రీకాంత్ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో ఫుట్‌పాత్‌లపై పడుకున్న వృద్ధులు, అనాథలకు చలి నుంచి కాపాడడానికి దుప్పట్లను పంపిణీ చేశారు.

\- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి



రాంనగర్: రాజ్యాంగం పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న తెలంగాణ జ్యూడిషియల్ అకాడమి మాజీ డైరెక్టర్ మంగాని రాజేంద్ర, అధ్యాపకులు తదితరులు



నల్లకుంట: సత్యానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కే.పీ.మురళీకృష్ణ



ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రాజ్యాంగ నిర్మాత స్మరణలో..

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని లోయర్ ట్యాంక్ బండ్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వాడవాడలా అంబడ్కర్ విగ్రహాలకు నాయకులు, ప్రజలు, ధికారులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతులను ప్రదర్శించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు దక్కాయని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంపీ వి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విముక్తి లభించిందని ధర్మసమాజ్ పార్టీ సికింద్రాబాద్ కో కన్వీనర్ గుడపర్తి సంతోష్ అన్నారు.
- భారత రాజ్యాంగంపై విద్యార్థులు, యువత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.
- భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని తెలంగాణ జ్యూడీషియల్ అకాడమి మాజీ డైరెక్టర్ మంగాని రాజేంద్ర పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.
- భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికీ అందాలని క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్కి సేదేక్ పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా క్రైస్తవ అల్ప సంఖ్యాక వర్గాల హక్కులపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.



కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించిన ధర్మసమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కో కన్వీనర్ సంతోష్ మహరాజ్ తదితరులు



బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



అంబర్‌పేట సేవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాచిగూడ పీఎస్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఎస్ఐ ఏ.మేఘనకు శాలువాకప్పి సత్కరిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు.



గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు రత్నసాయి చంద్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, పి.నర్సింగ్‌రావు, బి.సురేష్, ఎన్.సత్తిరెడ్డి, జి.శ్రీనివాస్‌యాదవ్, ఎన్.లక్ష్మణ్‌యాదవ్, నీరజ్, ప్రకాష్, యాదగిరి, రాజు నివాళులర్పించారు.

18 కిలోల గంజాయి పట్టివేత

● సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అన్నదమ్ముల అరెస్టు ● వెస్ట్ బెంగాల్ టు మహారాష్ట్రకు సరఫరా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా రూ.4.50 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయి సరుకును స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్‌పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ హోగ్లీ మండలం రత్‌టాలా గ్రామానికి చెందిన ప్రీతంచౌదరి(37), సత్యంచౌదరి(29) ఇద్దరూ అన్నదమ్ములు. సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు గంజాయిని విక్రయించాలని నిర్ణయించుకన్నారు. ఈ సోమవారం వెస్ట్ బెంగాల్‌లోని శాలిమార్ టౌన్‌లో 18 కిలోల గంజాయి సరుకును కొనుగోలు చేశారు. ముంబైలో విక్రయించేందుకు రైలులో గంజాయి బ్యాగులతో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై మాజీద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాట్ ఫాం నెంబరు 2లో ఆగి ఉన్న ముంబై ఎక్స్‌ప్రెస్‌లో లగేజీలను తనిఖీ చేశారు. పక్కనే ఉన్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ బెంగాల్ గంజాయి సరుకును కొనుగోలు చేసి ఒక్కొక్క ప్యాకెట్ చొప్పున రూ.18 వేలకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో అన్నదమ్ములను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి పొడిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వేఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నామని జీఆర్‌పీ సీఐ తెలిపారు.



గంజాయి నిందితులను అరెస్టు చూపుతున్న జీఆర్‌పీ పోలీసులు

ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

పీడీఎస్‌యూ నేతల డిమాండ్

నల్లకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ గురుకుల వసతి గృహంలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకూ మెరుగైన సదుపాయాలు, వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. హాస్టల్స్‌లో అనేక సమస్యలున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. యూనివర్సిటీలలో అనేక సమస్యలు విలయతాండం చేస్తున్న వాటిపై దృష్టి సారించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారావు, భాస్కర్, నరేందర్, అనిల్, సహాయ కార్యదర్శులు పృథ్వీ, సాయికుమార్, కోశాధికారి సురేష్, నాయకులు వెంకటేష్, మహేందర్, గణేష్, రాజేష్ పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాపై అసత్య ప్రచారానికి

చరమగీతం పాడదాం : ధనుంజయ

నేడు మందిరాల నిర్వాహకులతో సమావేశం

మన్సూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబాపై కొంత కాలంగా వస్తున్న అసత్య ప్రచారాలకు రుజువుతో చరమగీతం పాడదామని షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షుడు, చింతపల్లి సాయి సన్నిధి చైర్మన్ మంచికంటి ధనుంజయ భక్తులకు పిలుపునిచ్చారు. నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 400 మందికిపైగా షిర్డీ సాయిబాబా మందిరాల చైర్మన్లు, అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, కార్యదర్శులు, ట్రెజరర్లతో నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథిగా షిరిడీలోని సాయిబాబా సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి గోరక్ష మహదేవ్ గాడిల్కర్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్‌తో పాటు పలువురు వక్తలు పాల్గొంటున్నారన్నారు. సమావేశానికి వచ్చేవారు ఎలాంటి సందేహాలు ఉన్నా 8885003535 ఫోన్ నంబర్‌లో తమను సంప్రదించాలని సూచించారు.

సమావేశంలో షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక కార్యదర్శి పీవీ సాయి, కోశాధికారి గుండా మల్లయ్య కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు



మహాధర్నాలో అభివాదం చేస్తున్న పలు సంఘాల నేతలు

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాటం చేసేందుకు సన్నద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అండ్ వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, వి ప్రభాకర్, బి.వెంకట్, విస్సా కిరణ్, కోటేశ్వర్‌రావు, ఆర్.వెంకట్, రాములు, వి.కృష్ణ, భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు యూసుఫ్, పాలడుగు భాస్కర్, బాలరాజు. జనక్ ప్రసాద్, నాగన్నగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం ప్రజల జీవితాల గురించి ఆలోచించాలని, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉపకరణాల ధరలు పెరిగిపోతున్నాయని, స్మార్ట్ మీటర్స్ పెడుతున్నారని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కూలీల సమస్యలు ఉపాధి హామీ కూలీల సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహాధర్నాలో తెలంగాణ రైతు సంఘం నాయకులు బొంతల చంద్రారెడ్డి, పి జంగారెడ్డి, సీఐటీయూ నాయకులు జె.వెంకటేష్, బూపాల్, ఏఐటీయూసీ నాయకులు నరసింహ, ఐఎఫ్‌టీయూ నాయకులు అనూరాధ, టీయూసిటీ నాయకురాలు ఎస్ఎల్ పద్మ, అరుణతో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



దివ్యాంగులను తిరుపతి దైవదర్శనానికి తీసుకెళుతున్న చుక్కాల చారిటిబుల్ ట్రస్ట్

దివ్యాంగులకు తిరుపతి దైవదర్శనం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దైవదర్శనం చేసుకోలేని వారికి చుక్కాల చారిటేబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ చేయూతనిందిస్తోంది. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ వేణు నగర వ్యాపితంగా 400 మంది దివ్యాంగులు, వృద్ధులను మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రెండు ప్రత్యేక రైళ్లలో సొంత ఖర్చులతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో ఒక్కడినే తిరుపతికి వెళ్లేవాడినని, అనంతరం స్నేహితులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులను తీసుకెళ్లేవాడినని తెలిపారు. వేంకటేశ్వరస్వామి దయతో స్తోమత లేని నిరుపేదలు, దివ్యాంగులను తిరుపతి దర్శనం చేయిస్తున్నానని తెలిపారు. ప్రతీ ఏడాది ప్రత్యేక రైలులో తిరుపతి దైవదర్శనానికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

ఎస్‌ఏ పోస్టులను డైరెక్ట్‌గా భర్తీచేయాలి

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కష్ణయ్య డిమాండ్



ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్ కృష్ణయ్య

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాలని ఎస్‌జీటీ టీచర్లకు ఇచ్చే 70 శాతం ప్రమోషన్లను పూర్తిగా తొలగించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఈడీ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఈడీ నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్ కృష్ణయ్య నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈడీ చేసిన వారికి వందశాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్‌జీటీ ఉద్యోగాలు ఏవిధంగా భర్తీ చేస్తున్నారో.. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలను కూడా కేవలం బీఈడీ అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా బీఈడీ అభ్యర్థులకు ఎస్‌జీటీ పరీక్ష రాసే అవకాశం కోల్పోయారని బీఈడీ అభ్యర్థుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం బీఈడీ చదివిన అభ్యర్థులకు ఎస్‌జీటీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఎస్‌జీటీ ఉద్యోగం పొందిన రెండు సంవత్సరాలలోపు ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చదివి పాసవడానికి అవకాశం ఇస్తూ ఇచ్చిన గెజిట్ చెల్లుబాటు కాదన్నారు. 2023లో గెజిట్ చెల్లదని కోర్టు తీర్పుద్వారా బీఈడీ అభ్యర్థులు ఎస్‌జీటీ ఉద్యోగం పొందే అవకాశం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 108 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70 శాతం ప్రమోషన్లతో భర్తీ చేస్తే.. బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్ ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మహాధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ నాయకులు కల్యాణ్ నాయక్, నరేష్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యానాయక్, అశోక్ పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే చర్యలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే చర్యలు పాలకులు మానుకోవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఆదివాసీ హక్కుల సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం స్వాతంత్ర్యం ముందు నుంచీ బిర్సాముండా, గుండాదర్, కొమురం భీమ్‌తో పాటు చాలా మంది పోరాటం చేసి హక్కులు సాధించుకున్నారన్నారు. రాజ్యాంగంలోని 1/70 చట్టం, పేసా చట్టం, గ్రామ సభ తీర్మానాలు, అటవీ హక్కుల చట్టం పాలకులు అమలు చేయడం లేదన్నారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో ఆదివాసీల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు నారాయణరావు, పికె ఎంజాన్, జ్యోతి, రాము, సుదర్శన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.